మురుగునీటితో ఇబ్బందులు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లో రహదారులపై డ్రైనేజీనీరు ప్రవహిస్తుండడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. డివిజన్‌లోని షాపూర్‌నగర్ నుంచి సుచిత్రకు వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో వెన్నెలగడ్డ మూడుగుళ్ల సమీపంలో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. అధికారులు స్పందించి మురుగునీటిని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


దేవాలయం వద్ద నిలిచిన మురుగునీరు



మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ ఎండీ వెంకటసుబ్బయ్య, చిత్రంలో చైర్మన్లు, డైరెక్టర్లు

వినియోగదారులకు మెరుగైన సేవలు

ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ ఎండీ వెంకట సుబ్బయ్య

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): అట్టడుగున ఉన్న వారిని అత్యున్నత శిఖరాలను అధిరోహించేలా ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ సేవలు అందించడమే తమ ముందున్న లక్ష్యమని ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ ఎండీ వెంకటసుబ్బయ్య అన్నారు. ఈ మేరకు కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో బ్యాంక్ 27వ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ (ఎమిరైటిస్) ఎంఎస్‌ఆర్‌వీ ప్రసాద్, చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు మాట్లాడుతూ.. 1997లో సొసైటీ ప్రారంభించామని, అన్ని వర్గాల వారికి లోన్లు ఇస్తూ వారి ఆర్థిక ఎదుగుదలతో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3922.76 కోట్లు లావాదేవీలు నమోదుకాగా.. అందులో 2081.96 కోట్లు డిపాజిట్లు రాగా, 1840.80 కోట్లు ఖాతాదారులకు లోన్లు ఇచ్చామన్నారు. బ్యాంక్ షేర్ హోల్డర్లకు 18 శాతం డివిడెండ్ ప్రకటించామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంక్ అప్డేట్ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి, డైరెక్టర్లు జీపీ రావు, ఎ.కోటేశ్వరరావు, జె.సత్యనారాయణ, ఎ.సోమలింగంగౌడ్, ఎం.శ్రీనివాసులు, బి.ప్రభాకరరావు, ఎం.గోపాల కృష్ణయ్య, బ్యాంక్ మేనేజర్లు, షేర్ హోల్డర్స్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు

భెల్‌కాలనీ, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): స్వాతినక్షత్రం సందర్భంగా ఆదివారం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు భార్గవ్ ఆధ్వర్యంలో విశేష పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించారు. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వర-యోగేశ్వరస్వామి దేవస్థానంలోని లక్ష్మీనరసింహ స్వామి అంతరాలయంలో ఉదయం 108 సుగంధ నదీజాలలతో కూడిన ద్రవ్యాలు, మధు, ఫల రసాలతో అభిషేకం నిర్వహించారు. వేదోక్త మహా పంచామృతాభిషేకం, తామర పువ్వులతో పుష్పార్చన, సుదర్శన సహిత లక్ష్మీనరసింహ హోమం, సాయంత్రం స్వామి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు.


మూలవిగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

నిర్మాణం అక్రమమంటూ భవనం సీజ్

అల్లాపూర్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ మహాత్మాగాంధీ రోడ్ నిర్మాణంలో ఉన్న ఓ భవనాన్ని జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇటీవల సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినందుకు జీహెచ్ఎంసీ యాక్ట్ సెక్షన్ 461 ప్రకారము సీజ్ చేసినట్టు భవనంపైన బ్యానర్‌ను అధికారులు అంటించారు. అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరిస్తామని ఓ పక్క ప్రభుత్వం 'హైడ్రా' ఆపరేషన్ జోరుగా సాగుతుండగానే ఇలా భవనం సీజ్ కావడం స్థానికంగా చర్చనీయాంశం అవుతోంది. ఇది తెలిసిన స్థానిక నిర్మాణదారుల్లో కూడా భయం మొదలైంది.

కానిస్టేబుల్ యాదయ్యకు సన్మానం

మాదాపూర్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో విశేష ధైర్యసాహసాలు ప్రదర్శించి రాష్ట్రపతి శౌర్య పతకాన్ని సాధించిన మాదాపూర్ సీసీఎస్ కానిస్టేబుల్ యాదయ్యను భగవాన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత భగవాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు ఆరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగారావు, స్థానికులు సర్వరావు నాయుడు, ప్రసాద్, మిరియాల రాఘవరావు, అరవ రామకృష్ణ, చందు శ్రీనివాసరావు, ఏవీ రత్నం, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మంజీరా నీటి సరఫరా ప్రారంభం

మియాపూర్: మియాపూర్ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఏలియన్స్ ఎలైట్స్ అపార్ట్‌మెంట్స్‌లో మంజీరా తాగునీటిని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఎన్నోఏళ్ల నుంచి తాగునీటి కోసం స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని నేటితో వారి సమస్య పరిష్కారమైందన్నారు.

సైబర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

గచ్చిబౌలి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల సైబర్ ఎన్‌క్లేవ్ కాలనీలో సమస్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదివారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీరోడ్లు నిర్మించాలని, విధిదీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, ప్రసాద్, సురేష్‌నాయక్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రవణ్, కాలనీ వాసులు రమేష్‌బాబు, వెంకయ్యనాయుడు, హర్షవర్దన్, ప్రతాప్ పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం


కిరణ్‌సాయి

నిజాంపేట్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. నిజాంపేట ప్రాంతలోని రాజీవ్‌గృహకల్పలో నివాసముంటున్న అప్పన్న కుమారుడు కిరణ్‌సాయి(13) 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు కిరణ్‌సాయి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు.తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి..


షాబుద్దీన్

గాజులరామారం: మతిస్థిమితం లేని వృద్ధుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. సాయిబాబానగర్ అహ్మద్ బస్తీకి చెందిన మహ్మద్ షాబుద్దీన్ (75) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడతో కుటుంబ సభ్యులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

దుండిగల్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణాజిల్లాకు చెందిన నీలం రాధాకృష్ణ(29) గండిమైసమ్మ ప్రాంతలో నివాస ముంటున్నాడు. శనివారం మధ్యాహ్నం గండిమైసమ్మ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాధాకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రగతినగర్ వినాయక మండపంలో లడ్డూ చోరీ

నిజాంపేట్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌కాలనీలో ఓ అపార్టుమెంట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు వినాయకుడి మండపంలో లడ్డూను దొంగిలించారు. మండపానికి కట్టిన పరదా, సీసీ కెమెరా వైర్లు కట్‌చేసి శనివారం అర్ధరాత్రి గణేశ్ చేతిలోని లడ్డూను దొంగిలించారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లకు మరమ్మతులు

దుండిగల్, సెప్టెంబర్8(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మేడ్చల్ జిలా, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రోడ్లు అధ్వానంగా మారాయన్నారు.


దుండిగల్ మున్సిపాలిటీలోని శంభీపూర్ గ్రామంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణవేణి


రాయదుర్గం: గచ్చిబౌలి ఎన్టీఆర్‌నగర్‌లో గణపతి పూజల్లో పాల్గొన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


హైదర్‌నగర్: కూకట్‌పల్లిలో వినాయక మండపంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపీ ఈటల రాజేందర్

గణేశుడికి ఘనంగా పూజలు

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లోని పలు కాలనీలు, బస్తీలలో వినాయకచవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల ఆకృతులతో ఉన్న వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించారు. మండపాలను భారీ సెట్టింగులతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈ పూజల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

- కేపీహెచ్‌బీలో తిరుమల టెంపుల్, మూసాపేట్‌లో భారీ గణనాథుడు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి.
- ఫతేనగర్ డివిజన్ కన్యకాపరమేశ్వరీ ఆలయం, భరత్‌నగర్ కాలనీ బాల్‌రెడ్డి అపార్టుమెంట్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడిని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పూజలు చేశారు.
- **భెల్‌కాలనీ:** గణనాథుని నవరాత్రి ఉత్సవాలు బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్, ఎంఐజీకాలనీ, ఎల్ఐజీ, విద్యుత్‌నగర్‌లలో ఏర్పాటు చేసిన మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.

హైదర్‌నగర్: కూకట్‌పల్లిలోని వివిధ మండపాల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గణేశుడికి పూజలు చేశారు. కూకట్‌పల్లిలో ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు చేశారు. హైదర్‌నగర్ సెవెన్‌హిల్స్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పూజలు చేశారు.

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి తండా, గోపన్ ఎన్టీఆర్‌నగర్ కాలనీలో గణేశుడికి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు.


బాలాజీనగర్‌లో మన అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి పూజల్లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సాధుప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి


ఫతేనగర్: గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్


దూలపల్లిలోని వినాయకుడి పూజల్లో వ్యవసాయ సహకార బ్యాంక్ డైరెక్టర్ బి.సత్యనారాయణ


కేపీహెచ్‌బీ ఆరోఫేజ్ ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో మహవీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తిరుమల దేవస్థానం సెట్టింగ్‌లో భక్తులను ఆకట్టుకుంటున్న గణేశుడు


నిజాంపేట్ మున్సిపల్ జర్నలిస్ట్‌కాలనీలో అన్నదాన కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి



నిజాంపేట గ్రామంలో వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడికి పూజలు


మూసాపేట్ బాల్‌రెడ్డి భవన్‌లో పూజల్లో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి తదితరులు


బొజ్జ గణపయ్యతో చిన్నారులు


బాలాజీనగర్‌లో వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసిన కమిటీ సభ్యులు తదితరులు


హైదర్‌నగర్: వివేకానందనగర్‌లో పూజల్లో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్ రంగరావు


భెల్‌లో పంచ ముఖాలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


భెల్ కాలనీలో హనుమాన్ గదపై కూర్చున్న గణేశుడు


భెల్ కాలనీలో జరిగిన పూజల్లో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, భక్తులు

జంట సర్కిళ్ల పరిధిలో గణేశ్ నిమజ్జనానికి కట్టుదిట్ట ఏర్పాట్లు

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు నిమజ్జనఘాట్‌ల వద్ద గణేశ్ నిమజ్జనానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఘాట్‌ల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా రక్షణ చర్యలు చేపడుతున్నారు. నిమజ్జనం చేసేందుకు ఘాట్‌ల వద్ద భారీ క్రేన్‌లను ఏర్పాటు చేశారు. షాపూర్‌నగర్‌లోని పోలీస్ క్వార్టర్స్ సమీపంలో నిమజ్జనానికి ప్రత్యేక ఘాట్‌ను ఏర్పాటుచేశారు. కవర్‌ను ఏర్పాటుచేసి నీటిని నింపి నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేశారు. అదే విధంగా సూరారం లింగం చెరువు, గాజులరామారం పరికిచెరువులను నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.

నిమజ్జన ఏర్పాట్లపై సీపీ పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): గణపయ్య విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అన్నారు. ఈ మేరకు కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ (రంగదాముని చెరువు), ప్రగతినగర్ అంబీర్ చెరువులను ఆదివారం సందర్శించి, అక్కడ ఏసీపీ శ్రీనివాసరావు, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌వోలు కొత్తపల్లి ముత్తు, వెంకటేశ్వరరావులతో పాటు ఇంజనీరింగ్, ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడారు. మూడు, ఐదు, తొమ్మిది, పదకొండవ రోజులను దృష్టిలో పెట్టుకొని నిమజ్జనాలకు క్రేన్లు, తాగునీటి సౌకర్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా విభాగాల అధికారులకు సీపీ దిశానిర్దేశం చేశారు.

జేఎన్‌టీయూలో 'టీసీ'ల లొల్లి!

ప్రవేశాలకు తప్పనిసరి అంటున్న అడ్మిషన్ అధికారులు

తమ విభాగం నుంచి టీసీలు ఇచ్చే సంప్రదాయం లేదంటున్న ఆర్ అండ్ డీ సిబ్బంది

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం.. అన్నట్లుగా తయారైంది జేఎన్‌టీయూలోని కొన్ని విభాగాల పరిస్థితి. వర్సిటీలోని అడ్మిషన్ల విభాగం, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్ డీ) విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం విద్యార్థుల పాలిట శాపంగా పరిణమించింది. వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులకు, ఆర్ అండ్ డీ విభాగం నుంచి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. మరోవైపు ఒక సబ్జెక్టులో పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులు మరొక సబ్జెక్టులో పీహెచ్‌డీ చేసేందుకు టీసీ తప్పనిసరి అని అడ్మిషన్ల అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇటు టీసీలు ఇవ్వక, అటు ప్రవేశాలకు అనుమతించక అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలు పొందలేక..

జేఎన్‌టీయూ నుంచి పీహెచ్‌డీ పూర్తిచేసిన పలువురు అభ్యర్థులు ఇతర వర్సిటీల్లో మేనేజ్‌మెంట్, లా.. వంటి కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత సాధించారు. అయితే, వారు ఆయా కోర్సుల్లో అడ్మిషన్లు పొందాలంటే టీసీ సమర్పించడం తప్పనిసరి చేశారు. దీంతో వందలాది మంది అభ్యర్థులు తమకు టీసీ మంజూరు చేయాలని జేఎన్‌టీయూ ఆర్‌అండ్‌డీ విభాగం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే, టీసీ జారీచేసే సంప్రదాయం తమ విభాగానికి లేనందున తామేమీ చేయలేమని ఆర్‌అండ్‌డీ సిబ్బంది చెబుతుండడంతో విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. ఆర్‌అండ్‌డీ విభాగం నుంచి టీసీల జారీకి ఆదేశాలివ్వాలని కొందరు అభ్యర్థులు వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై వైస్‌చాన్స్‌లర్ సానుకూలంగా స్పందించినప్పటికీ కిందిస్థాయి అధికారులు కొందరు మోకాలడ్డుతున్నారని అభ్యర్థులు వాపోతున్నారు.

టీసీ లేకుంటే అడ్మిషన్లు ఇవ్వలేం

వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే తప్పనిసరిగా టీసీలు సమర్పించాలి. టీసీలు లేకుంటే అభ్యర్థులకు అడ్మిషన్లు ఇవ్వలేం. పీహెచ్‌డీ ప్రవేశాల కోసం వచ్చిన అభ్యర్థులు ఆర్‌అండ్‌డీ విభాగం టీసీలు ఇవ్వట్లేదని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి.

- కృష్ణమోహనరావు, అడ్మిషన్ల విభాగం డైరెక్టర్

ఉన్నతాధికారులు అనుమతిస్తేనే జారీ

జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ పూర్తిచేసిన అభ్యర్థులకు టీసీలు ఇచ్చే సంప్రదాయం లేదు. పలు ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలు కోరకుంటున్న అభ్యర్థులు టీసీల కావాలంటున్నారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి అనుమతి మేరకు చర్యలు తీసుకుంటాం.

- కామాక్షి ప్రసాద్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్

టీపీసీసీ రథసారథి మహేష్‌గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ


మహేష్‌గౌడ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, బండి రమేష్

బాలానగర్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, నియోజకవర్గ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఆయనకు పూల మాలవేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పుష్పారెడ్డి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- బొమ్మ మహేష్‌గౌడ్‌ను కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, మధుగౌడ్ పాల్గొన్నారు.
- ఓల్డుబోయినపల్లి సీనియర్ నాయకుడు దండుగుల యాదగిరి మహేష్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.
- కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, సునీతామహేందర్‌రెడ్డి, అవిజే జేమ్స్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

సాంస్కృతిక సంస్థల సేవలు అభినందనీయం

పంజాగుట్ట, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో సాంస్కృతిక సంస్థల సేవలు అభినందనీయమని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. భారత్ కల్చరల్ అకాడమీ రజతోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి బేగంపేటలోని పర్యాటక భవన్‌లో ఘనంగా జరిగాయి. ప్రముఖ సినీనటులతో లఘుచిత్రాలను నిర్మించిన అకాడమీ వ్యవస్థాపకుడు నాగబాల సురేష్ కుమార్‌ను ఆయన అభినందించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన గిరీష్ అయ్యపును సేవారత్న పురస్కారంతో సన్మానించారు. శారదాసాయి, భార్గవి, దక్షిణామూర్తి ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి, రిటైర్డ్ డీజీపీ సీఎన్ గోపీనాథ్‌రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ప్రముఖ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, సినీనటులు రోజారమణి, కవిత, జె.ఎల్.శ్రీనివాస్, లోహిత్ కుమార్, నిర్మాత రాహుల్ యాదవ్, వివిధ రంగాల ప్రముఖులు అరిగెల నాగేశ్వరరావు, శ్రీనివాస్, దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి'లో కమీషన్ల దందా


- పది వేలు కమీషన్ తీసుకుని అనర్హులకు చోటు
- ప్రభుత్వ ఉపాధ్యాయురాలి కుమార్తెకు ఆర్థిక సాయం
- ఎమ్మెల్యే చేతులమీదుగా అందుకున్న టీచర్ భర్త


ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నుంచి భాగ్యలతకు బదులు కల్యాణలక్ష్మి చెక్కు అందుకుంటున్న ఆమె భర్త మధుసూదన్

సరూర్‌నగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదలకు దక్కాల్సిన కొన్ని సంక్షేమ పథకాలు దళారుల కమీషన్ల దందాతో పక్కదారి పడుతున్నాయి. ఇందులో కల్యాణ లక్ష్మి పథకం ఒకటి. ఈ పథకం కింద పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లికి లక్షా నూట పదహారు రూపాయల ఆర్థిక సాయం అందిస్తారు. అయితే కొందరు నేతలు పదివేల దాకా కమీషన్ తీసుకుని అనర్హులకు ఆర్థిక సాయం మంజూరు చేయిస్తున్నట్టు తెలుస్తోంది. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌లో తాజాగా ఓ ప్రభుత్వ ఉద్యోగి కూతురికి కల్యాణలక్ష్మి ఆర్థిక సాయం మంజూరు కావడం చర్చనీయాంశంగా మారింది. నగర శివారులోని ఓ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసే మీర్‌పేట్ నంది హిల్స్ కాలనీకి చెందిన మిద్దెల భాగ్యలత కూతురు మేఘన వివాహం గత నవంబరులో జరిగింది. భాగ్యలత ప్రభుత్వ ఉద్యోగి (టీచర్). ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమె ఓటు హక్కు (ఐడీ నంబర్: వైయూవో 3269198) వినియోగించుకున్నట్టు ఓటరు జాబితాను బట్టి స్పష్టమవుతోంది. నిబంధనల ప్రకారం వీరికి కల్యాణలక్ష్మి పథకం వర్తించదు. కానీ కొందరు స్థానిక బీఆర్ఎస్ నేతలు దొడ్డిదారిలో పైరవీ చేసి వారికి ఆర్థిక సాయం మంజూరు చేయించారు. ఇందుకు రూ.పది వేలు కమీషన్ తీసుకున్నట్టు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

● 'ఆమె'కు బదులుగా 'ఆయన'

సాధారణంగా కల్యాణలక్ష్మి పథకం చెక్కులు పెళ్లికూతురి తల్లి పేరు మీద మంజూరవుతాయి. కాబట్టి తల్లే తీసుకోవాల్సి ఉంటుంది. మేఘనకు ఆమె తల్లి భాగ్యలత పేరు మీద చెక్కు రాగా.. తండ్రి బర్ల మధుసూదన్ (భాగ్యలత భర్త) మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి చేతుల మీదుగా అందుకోవడం గమనార్హం! గతంలో ఆమె తన బదిలీ కోసం అప్పుడు మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డి వద్దకు పలుమార్లు వెళ్లినట్టు సమాచారం. దాంతో ఆమెను సబిత గుర్తు పట్టే అవకాశం ఉందని గ్రహించిన మధ్యవర్తులు భాగ్యలతకు బదులు ఆమె భర్తను ఇటీవల మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తీసుకెళ్లి సబితారెడ్డితో చెక్కు అందించడం గమనార్హం. బాలాపూర్ రెవెన్యూ కార్యాలయంలోని కొందరు కిందిస్థాయి సిబ్బంది లంచాలు తీసుకుని ఇలా పైరవీకారులకు ఆర్థిక సాయం మంజూరు చేయిస్తున్నట్టు తెలిసింది.



3KL15 70787	Barla Meghana/ Barla Madhusudhan	Meerpet	9849266592	HNO. 3-193/2/1, PLOT NO 737,NANDI HILLS	9	Barla Bhagyalatha

కల్యాణలక్ష్మి లబ్ధిదారుల జాబితాలో బర్ల మధుసూదన్, భాగ్యలతల కుమార్తె మేఘన పేరు

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు కల్యాణలక్ష్మి పథకం వర్తించదు. మీర్‌పేట్‌లో ఓ టీచర్ కూతురికి ఆర్థిక సాయం అందినట్టు కొందరు నా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం. ఇందులో తమ సిబ్బంది పాత్ర ఉంటే వారిపైనా చర్యలు తప్పవు.

- ఇందిరాదేవి, తహసీల్దార్, బాలాపూర్ మండలం